క్లుప్తంగా

ముస్లింలకు ఎమ్మెల్యే సుచరిత రంజాన్ శుభాకాంక్షలు

తాడికొండ: ముస్లింలకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత రంజాన్ శుభాకాంక్షలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు కోరికలు నెరవేరి, పండుగ వేడుకను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లాహ్ దయతో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్కే రంజాన్ శుభాకాంక్షలు

మంగళగిరి: ముస్లింలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య బుధవారం ఒక ప్రకటనలో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు ముగించి, పండుగను ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా కుటుంబంతో కలసి జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మూలాంకురేశ్వరి ఆలయంలో చండీహోమం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ కొండపై కొలువై ఉన్న మూలాంకురేశ్వరి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రెండురోజులుగా నిర్వహిస్తున్న విశేష పూజలు, హోమాలు బుధవారంతో ముగిశాయి. ఉదయాన్నే ఆలయ అర్చకులు జి.అయ్యన్నశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో నిర్వహిస్తున్న గణపతి, రుద్ర, చండీ హోమాలు వేదపండితులు రాఘవేంద్రశర్మ, దివ్యేంద్రశర్మ పూర్ణాహుతి పూజలు చేశారు. మండపంలోని శ్రీచక్ర, పాదుకలకు ఖడ్గమాల కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైవేపై చలివేంద్రం ప్రారంభం



మంగళగిరి: వేసవి నేపథ్యంలో జాతీయ రహదారిపై ప్రయాణం చేసే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆరో బెటాలియన్ కమాండెంట్ వి.రత్న తెలిపారు. బుధవారం ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమాండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు డి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, టి.రవి పాల్గొన్నారు.

లోకేష్ హామీలు బూటకం



తాడేపల్లిరూరల్: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నారా లోకేష్ హామీలు బూటకమని ఇండియా కూటమి మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ కొండమీది కోతిని తెచ్చిస్తాను అంటున్నారని విమర్శించారు. 20 వేల మందికి ఇప్పుడు పట్టాలిస్తామని లోకేష్ హామీ ఇస్తున్నారని, 2014 నుంచి 2019 వరకు మంత్రి పదవుల్లో ఉన్నప్పుడు ఎందుకని పేదల భూములను రెగ్యులరైజేషన్ చేయలేదని ప్రశ్నించారు. కష్టకాలంలో ఇబ్బందులో పేద ప్రజలకు అండగా, నీడగా, తోడుగా ఉండే పార్టీ కేవలం సీపీఎం అని అన్నారు.

ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం ఎయిమ్స్ రోడ్‌లో గుర్తుతెలియని యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఉన్నట్లు స్థానికులు వీఆర్‌ఓ విన్నయ్యకు బుధవారం సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సాయిప్రసాద్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు అందించిన వివరాలు.. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ మీద వైట్ మచ్చలు ఉన్న ఫుల్ హ్యాండ్స్ నెక్ టీషర్ట్, పాచిరంగు నైట్ ప్యాంటు, మట్టిరంగు షూ ధరించి ఉన్నాడని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, జరిగిన ఈ ఘటనపై ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఉరివేసుకున్న వ్యక్తి ఎడమ చేతితో ఉరి తాడుని పట్టుకుని ఉన్నాడు ఎవరైనా ఉరి వేసుకుంటే సాధారణంగా రెండు చేతులు కిందకు వేళాడతాయి. చనిపోయిన వ్యక్తి బలవంతంగా తాడు మెడకు వేసి పైకి లాగుతున్నప్పుడు తాడు పట్టుకున్నట్లు కనిపించడం విశేషం. పోలీసులు మాత్రం ఇది ఆత్మహత్యగానే కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



17వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, పక్కన ఎమ్మెల్యే ఆర్కే, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు

- మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య
- ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: తమకు వారానికి మూడు రోజులు మంగళగిరి మూడు రోజులు హైదరాబాద్‌లో ఉండే విజిటింగ్ ప్రొఫెసర్ అవసరం లేదని, స్థానికంగా అందుబాటులో ఉండే మీకే అండగా ఉంటామని ప్రజలు ముందుకు వచ్చి ఆశీర్వదించడంతోనే తమ విజయం ఖాయమైందని వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో లావణ్య ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి లావణ్య, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ అపూర్వమన్నారు. బీసీ మహిళను గుర్తించి ఆశీర్వదించి టికెట్టు ఇచ్చిన సీఎం జగనన్నతో పాటు ఎమ్మెల్యే ఆర్కే అన్న అండతో తాను తప్పకుండా విజయం సాధించనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. డబ్బు సంచులతో గెలవాలనుకునే వారికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్పి తీరుతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఐదేళ్లు కనీసం నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని లోకేష్ ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తానంటూ చెబుతున్న మోసపు మాటలు నమ్మడానికి మంగళగిరి ప్రజలు అమాయకులు కాదు అని గుర్తించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు డోకిపర్తి శ్రీనివాసరావు, ఊట్ల కల్యాణ్, నాలి వెంకట కృష్ణ, గోలి కస్తూరి, మునగాల చంద్రశేఖర్, మాచర్ల శ్రీనివాసరావు, గాదె శేషిరెడ్డి, చక్రవర్తి, నృసీముల్లా పాల్గొన్నారు

మణిపాల్‌లో భద్రతపై అవగాహన



నర్సింగ్ సిబ్బందికి భద్రతా చర్యలపై అవగాహన కల్పిస్తున్న మణిపాల్ వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో నర్సింగ్ సిబ్బందికి అధునాతన భద్రతా చర్యలు– తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ఆస్పత్రి సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంచేందుకు ఎయిమ్ ఫర్ సేఫ్టీ కార్యక్రమాన్ని బెక్టన్ డికిన్సన్ ఇండియాతో కలసి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధునాతన భద్రతా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా చేసుకున్నామని అన్నారు. మనం ఎప్పటికప్పుడు మారుతున్న ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రయాణిస్తున్న తరుణంలో మణిపాల్ హాస్పిటల్‌లో భద్రతకు ప్రాధాన్యమిస్తూ, రోగుల ఆరోగ్యం మరియు భద్రతను రక్షించడంలో అంకిత భావాన్ని ప్రదర్శిస్తున్నామని అన్నారు. అధునాతన శిక్షణను అందించడం, భద్రతా చర్యల ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం ద్వారా సరైన ఆరోగ్య సంరక్షణ ఫలితాలను అందించడానికి నర్సింగ్ బృందానికి సాధికారత కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉత్తమ్ శర్మ, ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శ్రీనివాసరావు, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ పి.శిరీష, నర్సింగ్ సూపరింటెండెంట్ బి.వసంత, జనరల్ ఫిజిషియన్ మనోజ్‌కుమార్, బీడీ మేనేజర్ బి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి వైఖరి వెల్లడించాలి



మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: బీజెపితో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీలు ముస్లిం రిజర్వేషన్‌లపై తమ వైఖరిని స్పష్టం చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. బుధవారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లు తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణంగా రద్దు చేస్తామని ఇప్పటికే కేంద్ర బీజేపీ అగ్రనేత అమిత్‌షా ప్రకటించడం దారుణమని అన్నారు. ఈ విషయంపై స్పందించకపోతే టీడీపీ, జనసేత అధినేతలు కూడా రిజర్వేషన్ల రద్దుకు అంగీకారం తెలిపారని భావించాల్సి వస్తుందన్నారు. కుట్రలు, కుతంత్రాలతో ప్రజల్లోకి వస్తున్న కూటమికి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, మహమ్మద్ ఫైరోజ్ పాల్గొన్నారు.

ఓటు కోసం యువత దరఖాస్తు చేసుకోవాలి

ఈఆర్వో రాజకుమారి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఈఆర్వో రాజకుమారి

మంగళగిరి: ఏప్రిల్ ఒకటో తేదీ నాటి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి కోరారు. బుధవారం స్థానిక ఎన్నికల కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జేసీ పలు సూచనలు చేశారు. 85 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు ఇంటి వద్దనే ఓటు వేసేలా ఇప్పటికే బీఎల్‌ఓల ద్వారా ఫారం డీ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 22వ తేదీలోగా ఫారం డీ లను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. కాజ, చినకాకాని గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లకు ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏఈఆర్వో బి.శివారెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం

తాడికొండ ఈఆర్వో గంగరాజు



మాట్లాడుతున్న ఈఆర్వో గంగరాజు

తాడికొండ: నామినేషన్ కార్యక్రమంలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా పూర్తి అవగాహన కలిగి ఉండాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు సూచించారు. తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలోని ఆర్ఓ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బందితో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభ్యర్థులు ఇటీవల దిగిన కొత్త ఫొటోగ్రాఫ్, నూతనంగా తీసుకున్న బ్యాంకు అకౌంటు పుస్తకం సమర్పించాలని ఇప్పటికే నామినేషన్ ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులకు పూర్తి సమాచారం ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఈ నెల 18–25వ తేదీ వరకు నామినేషన్‌ల స్వీకరించనున్నట్లు చెప్పారు. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి దగ్గరే ఓటు హక్కు వేసే అవకాశం తొలిసారి ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. అలాంటి వారి కోసం 12డీ ఫామ్‌లను బీఎల్‌ఓలకు అందజేస్తే వారు సంబంధిత ఓటరు దగ్గరకు వెళ్లి ఇంటి వద్దే ఓటు వినియోగం కోసం దరఖాస్తులు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆ జాబితాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే సంబంధిత తేదీ కేటాయించి, అధికారులను ఇంటి వద్దకు పంపించి ఓటు వేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 15–16 తేదీలలో ఎన్నికల విధులు నిర్వహించే పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుంది కనుక సిబ్బంది అందరూ హాజరు కావాలని సూచించారు. తాడికొండ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల మెటీరియల్, ఈవీఎంలు, ఇతర సామగ్రి జేకేసీ కళాశాలలో అందజేస్తారని, ఏఎన్‌యులో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు సబ్ డివిజన్ డీఎస్పీ ఈ అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

బ్లేడుతో భార్య గొంతు కోసిన భర్త

పెదకాకాని: కోర్టు పరిధిలో ఉన్న కేసును ఉపసంహరించుకోలేదనే కోపంతో భర్త బ్లేడుతో భార్య గొంతు కోసిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ షామీర్ అదే ప్రాంతానికి చెందిన తస్లీమ్‌ను ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి సంవత్సరం వయసున్న బాబు ఉన్నాడు. వివాహమైన కొద్ది రోజులకే షామీర్ వేధింపులు భరించలేని భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గృహహింస, వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. ప్రస్తుతం ఇద్దరూ పుట్టింటికీ, అత్తంటికీ దూరంగా ఇల్లు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. షామీర్ తరచూ భార్యను కేసు ఉప సంహరించుకోవాలని ఒత్తిడి తెస్తున్నాడు. కేసు ఉప సంహరించుకుంటే గతంలో మాదిరిగా వేధింపులకు గురిచేస్తాడని ఆమె అందుకు నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన షామీర్ బుధవారం ఒక పథకం ప్రకారం బ్లేడుతో భార్య గొంతు కోశాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం రక్తస్రావం అవుతున్న తస్లీమ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సయ్యద్ షామీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో వలంటీర్ల రాజీనామా కొనసాగుతోంది. తాజాగా బుధవారం దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులో 13 మంది రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు అందాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని, అలాంటి వారిపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తూ వారి నోటికి వచ్చినట్లు మాట్లాడి, వృద్ధులను, వికలాంగులను తీవ్ర ఇబ్బందులను గురిచేశారని ఆరోపించారు. కంఠంరాజు కొండూరులో రాజీనామా చేసిన వారిలో కావూరి అశోక్‌బాబు, రావూరి సురేష్, పెండ్యాల పవన్‌బాబు, గోసాల జీవన్ కిషోర్, తాడిబోయిన శ్రీకాంత్, దేశబోయిన సుమలత, సయ్యద్ అస్మ, తొలిచూరి ఆశ, షేక్ నాగుల్ షరీఫ్, కొండూరు నిర్మల, జొన్నాదుల బేబీ లక్ష్మి, షేక్ రజియా, తాడిబోయిన వెంకట సుధీర్ ఉన్నారు.

తాడికొండలో 17 మంది..

తాడికొండ: గ్రామంలో 17 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా బుధవారం రాజీనామా సమర్పించారు. సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకొని మరింత ప్రజాసేవ చేసేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు.

కోల్డ్ స్టోరేజీ యజమాని ఆస్తులపై ఆంక్షలు విధించాలి



తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ యజమాని తన ఆస్తులను విక్రయించకుండా, తనఖా పెట్టకుండా సబ్ రిజిస్ట్రార్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు కోరారు. ఆ ప్రకారం బుధవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. యజమాని నిర్లక్ష్యం కారణంగా కోల్డ్ స్టోరేజిలోని రూ.120 కోట్ల పసుపు పంట దగ్ధమైందని తెలిపారు. కోల్డ్ స్టోరేజీ బ్యాంకు ఖాతాలను సీజ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు మేరకు క్వింటాలుకు రూ.12,500 ఇప్పించేలా చూడాలన్నారు. ముందుగా నష్టపోయిన రైతులకు బీమా పరిహారం చెల్లించి, యజమానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, బోగస్ రైతులకు కాకుండా నిజంగా నష్టపోయిన రైతులకే పరిహారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రైతులు, కోల్డ్ స్టోరేజి యజమానికి సమావేశం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తానని చెప్పారు. కోల్డ్ స్టోరేజి అగ్నిప్రమాదంపై ఇంకా రెండు శాఖలకు చెందిన నివేదికలు రావాల్సి ఉందని, రైతాంగం అభిప్రాయాలను కలెక్టరు దృష్టికి తీసుకెళతానని హామీనిచ్చారు. బాపట్ల జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, గద్దె శ్రీహరి, నాదెళ్ల చంద్రశేఖర్, మందాళ ప్రదీప్‌రెడ్డి, కళ్లం శ్రీనివాసరెడ్డి, యు.హనుమాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

వీరికి ఎన్నికల కోడ్ వర్తించదా...



బోరుపాలెంలో ఎన్‌టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు ముసుగులు తొలగించిన దృశ్యం

తాడికొండ: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా అధికారులకు కొన్ని నిబంధనల అతిక్రమణ కనిపించకపోవడం విడ్డూరంగా మారింది. తుళ్లూరు మండలం బోరుపాలెంలో ఓ టీడీపీ నాయకుడు యథేచ్ఛగా కోడ్‌ను ఉల్లంఘించి తన ఇంటి ముందు ఉన్న ఎన్‌టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు ముసుగులు వేయకుండా అడ్డుకుంటుంటే కనీసం ఉన్నతాధికారుల దృష్టిలోకి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీనిపై గ్రామంలో పలువురు ఫిర్యాదులు చేస్తున్నా టీడీపీ నాయకుడు బెదిరింపులతో సిబ్బంది నాయకులు ఆ విగ్రహాలకు ముసుగులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఫిర్యాదు చేసినప్పుడు ముసుగులు వేయడం, వెంటనే సదరు నాయకుడు తొలగించడం పరిపాటిగా మారింది.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం



మత్స్యకారులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత మత్స్యకారులకు భరోసా ఇవ్వడంతో పాటు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు, వీర్లపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకోసం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ప్రచారంలో పాల్గొన్నారు. గొడవర్రులో టీడీపీ, ఇతర పార్టీల నుంచి వంద మత్స్యకార కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరి పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకారుల నాయకులు గోపాలకృష్ణ, ఏడుకొండలు, నడకుదిటి గోపి, గ్యాంగేరాజు మాట్లాడుతూ మత్స్యకారులకు అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, ఎస్ రత్నం, ఎం.రవీంద్ర, డి.వీరయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం



సీతానగరం 14వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం 14వ వార్డులో తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పట్టణ కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పేద బడుగు, బలహీన వర్గాలకు అందించిన సంక్షేమం, 14వ వార్డులో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య, పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్యలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సోషల్ మీడియా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేక వెంకటరామిరెడ్డి, మేడ వెంకటేశ్వరరావు, కనకదుర్గ గుడి ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, మంగళగిరి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె.ఈశ్వరి, ఎస్సీ సెల్ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, రొడ్డ ఎలీష, వుండ్రు కల్యాణ్, నాయకులు గుత్తి అశోక్, తిరుమలశెట్టి సురేంద్ర, మానుపాటి సుధీర్ కుమార్, సాతుపాటి శ్రీను, నాగబాబు, చిలుకోటి శ్రీనివాస్, టి. రాజేశ్వరి, కళ, శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

రూ.77,500 నగదు స్వాధీనం

తాడికొండ: నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకెళ్తున్న మహిళ వద్ద నుంచి రూ.77,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డులోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ జి.అంకమ్మ తనిఖీలు చేస్తుండగా తుళ్లూరు మండలం శాఖమూరు గ్రామానికి చెందిన తలతోటి హవీల అనే మహిళ వద్ద రూ.77,500 నగదు లభించినట్లు వెల్లడించారు. తగిన రసీదులు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

పన్ను వసూలులో రెవెన్యూ సిబ్బంది కృషి అభినందనీయం

కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్



మంగళగిరి: పన్నుల వసూలులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ కొనియాడారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం పన్ను వసూలులో ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ వృత్తి నిర్వహణలో చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. పన్నులు చెల్లించాల్సిన గృహ యజమానులు ఈ నెల 30వ తేదీలోగా చెల్లించి పన్ను రాయితీ 5 శాతం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆర్‌ఓ బాబూరావు, మురళి, ఆర్‌ఐలు యశోధరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణయే ఘనతకు మార్గం

తాడేపల్లిరూరల్: విధి నిర్వహణయే ఘనతకు మార్గం అవుతుందని ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్ను / ఖాళీ స్థలం పన్ను వసూలులో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి నుంచి సువార్త ఉజ్జీవ మహాసభలు

గుంటూరు రూరల్: ప్రపంచ శాంతి కోసం క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ ప్రతి ఏటా కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించే 18వ వార్షిక సువార్త ఉజ్జీవ మహాసభలు ఈనెల 11వ తేదీనుంచి ప్రారంభించనున్నట్లు కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. బుధవారం నల్లపాడు రోడ్డు హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎదురుగా గల మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమై 12, 13, 14వ తేదీ ఆదివారం రాత్రి వరకూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ ప్రత్యేక ప్రార్థనల్లో దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు పాల్గొంటారని చెప్పారు.